సర్వసాధారణమైన ప్రశ్నలు - వాటికి సమాధానాలు

1. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్‌సి) జారీ చేసే ఉద్యోగ నియామకాల ప్రకటనల ప్రకారము ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలంటే ఏమి చేయాలి?

   ప్రతి అభ్యర్ధి ప్రకటనతో సంబంధం లేకుండా ముందుగానే ఏపిపిఎస్‌సి వెబ్ సైట్ లో తన వివరాలను నమోదు చేసికొని ఒక గుర్తింపు సంఖ్యను పొందవచ్చు. ఈ ప్రక్రియను OTPR రిజిస్ట్రేషన్ అని సాధారణ పరిభాషలో అనడం పరిపాటి. ఈ నమోదు ప్రక్రియ గురించి వెబ్ సైట్లోని వినియోగదారుని చేపుస్తకం (USER MANUAL) లో వివరంగా తెలుపడం జరిగింది. OTPR లో నమోదు ఒకే సారి వుంటుంది. మరలా మరలా చేయవలసిన అవసరం లేదు.

   ప్రతి అభ్యర్ధి నమోదు చేసుకొనే ముందు తన యొక్క చరవాణి సంఖ్య సరిగా వుందా లేదా చూసుకోవాలి. అదే విధంగా తన ఇ-మెయిల్ అడ్రెస్ సరిగా వుందో లేదో సరి చూసుకోవాలి. అదే విధంగా అభ్యర్ధి తాను వెల్లడించే వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకొనాలి. ఎందుకంటే, ఏపిపిఎస్‌సి ఎటువంటి ధృవీకరణ ఆ సమయంలో చేయదు కనుక. వెల్లడించిన వివరాలలో తప్పులు, అసత్యాలు కనుక ఉంటే దానికి అభ్యర్ధే బాధ్యత వహిస్తారు.

   OTPR నమోదు తర్వాత అభ్యర్ధి తనకు అర్హతలు ఉన్న ప్రకటనకు చివరి తేదీ లోగా దరఖాస్తు చేసుకొనవచ్చు. దరఖాస్తు చేసుకొనటానికి OTPR గుర్తింపు సంఖ్య అవసరం వుంటుంది కనుక ముందుగా OTPR లో నమోదు తప్పనిసరి.

2. ఒక సారి నమోదు చేసుకొన్న తరువాత OTPR లో మార్పు చేసుకొనవచ్చా?
   నిరభ్యంతరముగా చేసికొనవచ్చును. మార్పులు చేసుకొనే విధానం వెబ్ సైట్ లోని చేపుస్తకము (USER MANUAL) లో వివరంగా తెలుపబడింది.

3. ఏపిపిఎస్‌సి, ఒక ప్రకటన చేసేముందు అభ్యర్థుల యోగ్యత మరియు అర్హతలను ఎలా నిర్ణయిస్తుంది?

   ఏపిపిఎస్‌సి, తన విధులలో భాగంగా ప్రతి ప్రభుత్వ శాఖ నుండి ఏ ఏ ఉద్యోగాలు నింపడానికి ఉన్నాయో సేకరిస్తుంది. ప్రతి ప్రభుత్వ శాఖ, నింపవలసిన క్రొత్త పోస్టుల సంఖ్య, ఇంతకు ముందు ప్రకటనలలో నింపబడని పోస్టుల సంఖ్య, అర్హతలు (విద్య, వయసు వంటివి), రిజర్వేషన్ వివరములు, రోస్టర్ వివరములు వంటివి ఏపిపిఎస్‌సి కి పంపడము జరుగుతుంది. ఏపిపిఎస్‌సి ఉద్యోగులు, ఈ పోస్టులకు సంబంధిత సర్వీస్ నిబంధనలు మరియు ఉద్యోగ నియయామకానికి సంబంధించిన ప్రభుత్వ నియమాలతో (ఏపి స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్

రూల్స్ వంటివి) సరి చూసుకొని, ఏదైనా తేడా ఉంటే సంబంధిత శాఖనుండి సందేహ నివృత్తి చేసుకొని, ప్రకటన వెలువరించడము జరుగుతుంది. ఏపిపిఎస్‌సి రూల్స్ ఆఫ్ ప్రొసీజర్ లోని నియమము 3 ప్రకారము, ఒక శాఖ పంపిన సమాచారములో ఉన్న పోస్టుల సంఖ్యకు మాత్రమే ప్రకటన జారీ చేయగలుగుతుంది. పోస్టులపై రిజర్వేషను కు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. విద్యార్హతలు, వయస్సు వంటివి కూడా ఏపి స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ వంటి నిమయాలను పాటించి మాత్రమే నిర్ణయం చేయడము జరుగుతుంది. ఈ వివరాలన్నీ ప్రతి ప్రకటనలో పొందు పరచడము జరుగుతుంది.

4. ఒక ప్రకటనకి దరఖాస్తు నింపేటప్పుడు అనేక సందేహాలు వస్తున్నాయి. ఏమి చేయాలి?

ప్రకటనలో అర్హతలు, ఇతర నిబంధనలు వివరంగా, సరళంగా ఉంటాయి. దరఖాస్తు చేసుకొనేముందు వివరాలు అన్నీ పరిశీలించుకొని, సందేహ నివృత్తి చేసుకొని అప్పుడు దరఖాస్తు నింపడము మంచిది. ఏవైనా గంభీరమైన సందేహాలు ఉంటే నివృత్తి కోసము APPSC HELP DESK కి ఆఫీసు సమయములో ఫోన్ చేయవచ్చును.

5. ఒక ప్రకటన వెలువరించిన తరువాత, ఏపిపిఎస్‌సి మార్పులు, చేర్పులు చేయగలుగుతుందా?

ప్రకటన వెలువడిన తరువాత అర్హతల విషయంలో మార్పులు చేయడం జరగదు. కేవలము, ఏవైనా ప్రకటనకు ముందు ఉన్న అర్హతలు పొందు పరచకపోతే వాటిని జత చేయడం జరుగుతుంది. అయితే పరీక్షకు సంబంధించిన విషయాలో అనగా సమయము, తేదీ, నిర్వహించే పద్ధతి వంటి వాటిలో అవసరమైనప్పుడు మార్పులు చేర్పులు చేసే అధికారం ఏపిపిఎస్‌సి కి ఉన్నది.

6. ఏపిపిఎస్‌సి ఏవైనా కోచింగ్ సంస్థలకు గుర్తింపు ఇచ్చిందా?

ఏపిపిఎస్‌సి ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ సంస్థ ద్వారా ఏ ప్రైవేట్ సంస్థకు గుర్తింపు ఇవ్వడము జరగదు. అదే విధంగా ఏ ప్రైవేట్ సంస్థా, ఏపిపిఎస్‌సి లోగో కానీ ప్రభుత్వ లోగో కానీ వాడినట్లైతే శిక్షార్హం అవుతుంది. ఒక అభ్యర్థి కోచింగ్ తీసుకోవాలా లేదా అనేది అతని/ఆమె స్వంత నిర్ణయము. ప్రశ్నల రూపకల్పనలో గాని, ప్రశ్న పత్రాల మదింపులో గాని, ప్రైవేట్ వ్యక్తులకు స్థానం లేదు. ఈ కార్యములు నిష్పక్షపాతంగా నిపుణుల ద్వారా జరుగుతాయి.

7. ఒక అభ్యర్థి, పరీక్ష తయారీలో ఎటువంటి పుస్తకాలు చదవాలి. ఏపిపిఎస్‌సి రిఫరెన్స్ పుస్తకాలు నిర్ణయిస్తుందా?

పాఠ్య ప్రణాళికని నిర్ణయించే వరకే ఏపిపిఎస్‌సి బాధ్యత. ఒక అభ్యర్థి ఏ పుస్తకాలు చదవాలి లేక ఎవరి సలహాలు తీసుకోవాలి అనేది అతని/ఆమె ఇష్టము. అదే విధంగా పోటీ పరీక్షలకు కొన్ని పుస్తకాలు మాత్రమే చదవాలని పరిమితి విధించడానికి వీలు కాదు. అయితే ఈ విషయంలో ప్రశ్నలకు/సమాధానాలకు ప్రామాణికత మరియు విశ్వసనీయత ముఖ్యం కనుక, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణలు, NCERT/CBSE ప్రచురణలు, తెలుగు అకాడెమీ ప్రచురణలు, ప్రభుత్వ వెబ్ సైట్లలో ఉన్న వివరాలు ప్రామాణికంగా పరిగణింప బడతాయి. ఇవి కాక అభ్యర్థులు తమకు నచ్చిన పుస్తకాలు ఏవైనా చదువుకోన వచ్చును. అయితే ప్రామాణికత మరియు విశ్వసనీయత ఉండాలి.

8. నాకు అనేక విషయాలలో సందేహాలు ఉన్నాయి? ఉదాహరణకు లోకల్/నాన్ లోకల్, క్రీమీ లేయర్, విద్యార్హత, వయస్సు, రిజర్వేషన్, రోస్టర్, ఇంకా ఇలా ఎన్నో సందేహాలు ఉన్నాయి? వీటికి ఏపిపిఎస్‌సి సమాధానాలు చెపుతుందా?

పై విషయాలలో నిర్ణయాలు తీసుకొనడము ఏపిపిఎస్‌సి పరిధి లోకి రాదు. పైన చెప్పిన ప్రతి విషయానికి చట్ట బద్ధమైన నియమాలు మరియు నిర్ణాయక సంస్థలు ఉన్నాయి. ఏపిపిఎస్‌సి రాజ్యాంగ బద్ధముగా ఏర్పడిన సంస్థ. ఏపిపిఎస్‌సి యొక్క ప్రధాన బాధ్యత పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించి, ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రభుత్వ విభాగాలకు పంపడము. ఈ బాధ్యతలో భాగముగా ఎంపికైన అభ్యర్థుల అర్హతా పత్రాలను పరిశీలించడము జరుగుతుంది. ప్రాధమిక సందేహాలకు సమాధానాలు ఇవ్వడము ఈ ప్రక్రియలో ఒక భాగము. పత్రాల ధృవీకరణ ఏపిపిఎస్‌సి బాధ్యత కాదు.

9. ఈ మధ్య వెలువడిన ఒక ప్రకటనలో BCAని అర్హతగా తీసుకొన్నారు. నేను డైరెక్ట్ గా MCA చేశాను. అదే విధంగా ఒక పోస్టుకి BSc(కంప్యూటర్) లేక సమానమైన డిగ్రీ అర్హతగా ఇచ్చారు. నేను సమానమైన డిగ్రీ చదివినాను. నాకు అర్హత వుందా?

ప్రభుత్వ నియముల ప్రకారము మరియు ప్రభుత్వ శాఖలు తెలిపిన విద్యార్హతలను మాత్రమే ఏపిపిఎస్‌సి తన ప్రకటనలలో పొందు పరుస్తుంది. ఈ విషయంలో ఏపిపిఎస్‌సి నిర్ణయం తీసుకోదు. అదే విధంగా సమానమైన డిగ్రీ అన్నప్పుడు “సమానత” చూపించవలసిన బాధ్యత అభ్యర్థిపైనే ఉంటుంది. ఏ శాఖ అయితే విద్యార్హతలను నిర్ణయించిందో ఆ శాఖాధిపతి గాని, ప్రభుత్వం గాని లేక UGC/AICTE వంటి సంస్థలు గాని “సమానతను”

నిర్ణయిస్తారు. కావున, అభ్యర్థులు నేరుగా సంబందిత సంస్థల నుండి గుర్తింపు పత్రము తీసుకొనాలి. ఒక వేళ ఏపిపిఎస్సి కి వ్రాసినట్లైతే, మేము కూడా శాఖాధిపతులకు, యూజిసి/ఏఐసిటిఈ లకు మీ విన్నపాన్ని పంపడము జరుగుతుంది. వారి ప్రతి స్పందను బట్టి పరీక్షకు అనుమతించాలా లేదా అనే నిర్ణయం తీసుకొనడము జరుగుతుంది. ఎంపిక జరిగిన తరువాత కూడా శాఖాధిపతి అర్హతా పత్రాలను పరిశీలించి, తగిన అర్హత వుంటేనే నియామకము చేస్తారనేది ప్రతి అభ్యర్ధి గమనించవలసిన విషయం.

10. చదువు, లోకల్/నాన్ లోకల్/రిజర్వేషన్/అంగ వైకల్యంల ధృవీకరణ పత్రాలు పరీక్షా కేంద్రములో పరిశీలిస్తారా?

లేదు. నియామక పరీక్షలలో అర్హత సాధించి ఎంపిక కాబడిన అభ్యర్ధుల పత్రాలు మాత్రమే తగు సమయములో పరిశీలింపబడుతాయి.

11. ఇటీవల ఏపిపిఎస్సి విడుదల చేసిన ఒక ప్రకటనకి సంబంధించిన ఉద్యోగానికి నాకు విద్యార్హత ఇంకా రాలేదు. నేను చివరి సంవత్సరములో చదువుతున్నాను. నాకు ఉద్యోగము వచ్చే నాటికి అర్హతా పత్రం లభిస్తుంది. నేను దరఖాస్తు చేసుకొనవచ్చా?

లేదు. ఏపిపిఎస్సి ఇచ్చిన ప్రకటనలో, ప్రకటన వెలువడే నాటికి విద్యార్హత ఉండాలని స్పష్టంగా తెలుపడము జరుగుతున్నది. అర్హత లేని అభ్యర్ధులు పరీక్ష వ్రాసి ఎంపిక అయితే, ఒక అర్హత గల అభ్యర్ధికి అన్యాయం జరుగుతుంది. అసత్య సమాచారం ఇచ్చి పరీక్ష వ్రాసే అభ్యర్ధులు, చట్టపరంగా శిక్షార్హులు అవుతారు. మరియు అనర్హతకు గురవుతారు. వివరములకు 18/10/2016 న GAD విడుదల చేసిన జిఓఎంఎస్ సంఖ్య: 385 చూడగలరు.

12. లోకల్/నాన్ లోకల్ విషయంలో నాకు అనేక సందేహాలు ఉన్నాయి? అవి ఎలా నివృత్తి చేసుకోవాలి?

ప్రతి ప్రకటనలో ఈ విషయానికి సంబంధించిన రూల్స్ (నియమములు) పొందు పరచడము జరుగుతుంది. తత్సంబంధమైన నియమములను చదివి, తను అర్హుడా, కాదా అనేది నిర్ణయించుకోవడము సదరు అభ్యర్ధి బాధ్యత. రాజ్యాంగములోని 371D అధికారణము క్రింద స్థానికత గుర్తింపబడుతుంది. 20/10/1975 నాడు వెలువడిన GO Ms No 674 GA (SPF) Department లోను, తదనంతరము ఈ విషయంలో వెలువడిన ప్రభుత్వ ఆదేశముల ప్రకారము, స్థానికతను గుర్తించాలి. కనీస విద్యార్హతలను నిర్యాయించని పోస్టులకు నివాసం ఆధారంగా స్థానికత నిర్ణయిస్తారు. కనీస విద్యార్హత నిర్ణయించిన పోస్టులకు, చదువుకొన్న ప్రాంతము మరియు కొన్ని సందర్భాలలో నివాసం ఆధారంగా స్థానికత నిర్ణయిస్తారు. ఒక వ్యక్తి లోకల్ లేక నాన్ లోకల్ అనే నిర్ణయము,

రెవెన్యూ శాఖ వారు చేస్తారు. ఏపిపిఎస్‌సి కేవలం కొన్ని ప్రాధమిక సందేహాలను మాత్రమే నివృత్తి చేయగలుగుతుంది.

13. నేను పాఠశాల చదువు అనగా 10వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివినాను. 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు అంతరాయం లేకుండా ఒకే ప్రాంతములో చదివినాను. ఇంటర్మీడియట్ లేక డిగ్రీ ప్రైవేట్ గా చదివాను. నేను రెగ్యులర్ అభ్యర్ధిగా గుర్తింపబడతానా లేక ప్రైవేట్ అభ్యర్ధిగానా?

లోకల్/నాన్ లోకల్ విషయంలో మీరు రెగ్యులర్ అభ్యర్ధిగా ఉంటారు. మీరు ఏ ప్రాంతములో 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు అంతరాయము లేకుండా చదివారో, ఆ ప్రాంతమునకు లోకల్ అవుతారు. అయితే విద్యార్హతల విషయంలో ప్రైవేట్ అభ్యర్ధిగా ఉంటారు. దీని వలన లోకల్ విషయంలో ఏ మార్పు ఉండదు.

14. నేను పాఠశాల చదువు అనగా 10వ తరగతి వరకు వేరు వేరు ప్రాంతములలో చదివినాను. 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఒక ప్రాంతములో చదువలేదు. నేను ఏ ప్రాంతమునకు లోకల్ అవుతాను?

మీరు 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆంధ్ర ప్రదేశ్ లో చదివినట్లైతే, ఏ ప్రాంతములో ఎక్కువ సంవత్సరములు చదివినారో, ఆ ప్రాంతమునకు లోకల్ అవుతారు. ఒక వేళ ఒకటి కన్నా ఎక్కువ ప్రాంతములలో సమానమైన కాలము చదివినట్లైతే, ఆ ప్రాంతములలో చివరగా ఎక్కడ చదివారో, ఆ ప్రాంతమునకు లోకల్ అవుతారు (పోస్టుని బట్టి అది జిల్లా కానీ లేక జోన్ కానీ).

15. నేను 4వ తరగతి నుండి 10వ తరగతి లోపల ఒక సంవత్సరము తప్పినాను?

పైన తెలిపిన ఇతర అర్హతలు ఉంటే, తప్పిన సంవత్సరము లెక్కలోకి తీసుకొనకుండా స్థానికత నిర్ణయించబడుతుంది.

16. నేను 4వ తరగతి నుండి 10వ తరగతి మధ్యలో కొన్ని సంవత్సరములు ఖాళీగా ఉన్నాను లేక ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలలో చదివినాను?

మీ స్థానికత, నివాసం ఆధారంగా గుర్తింపబడుతుంది

17. నేను 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు (ప్రస్తుత) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో చదువలేదు. ఉదాహరణకు హైదరాబాద్ లో చదివాను. నా వోటర్ కార్డ్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ అన్నీ హైదరాబాద్ లో ఉన్నాయి. కానీ నా జన్మ మూలాలు, బంధువులు అందరూ ఆంధ్ర ప్రదేశ్ లోనే ఉన్నారు?

మీరు లోకల్ అభ్యర్థి క్రింద పరిగణింప బడరు. అయితే మీరు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి 2/6/2014 నుండి 1/6/2017 లోపల ప్రవాసం/వలస వెళ్ళినట్లయితే, మీరు లోకల్ గా పరిగణింపబడతారు. వివరాలకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము 08/08/2016న విడుదల చేసిన సర్క్యులర్ మెమో సంఖ్య 4136/SPF & MC/2015-5 ను పరిశీలించగలరు . లోకల్ ధృవపత్రం పొందటానికి, సంబంధిత రెవెన్యూ అధికారులకు అభ్యర్థన ఇవ్వాలి. ఏదైనా ప్రకటనకు 'వలస వెళ్ళిన' కేటగిరీలో అర్హత పొందాలంటే, నోటిఫికేషన్ తేదీకి ముందు అర్హత సాధించాలి.

18. నేను 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు లేక మధ్యలో కొంత కాలము (ప్రస్తుత) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో చదువలేదు. వివాహమైన తరువాత లేక తదుపరి చదువు కోసము, ఆంధ్ర ప్రదేశ్ లో స్థిరపడినాను. నా కుటుంబము, వోటర్ కార్డ్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ అన్నీ ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్నాయి?

ప్రాధమిక సమాచారం ప్రకారము తమరు నాన్ లోకల్ అవుతారు.

19. నేను పుట్టినప్పడినుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోనే నివసిస్తున్నాను. కానీ సరిహద్దు ప్రాంతములో ఉండటము చేత రోజూ ప్రక్క రాష్ట్రములోని పాఠశాలకు వెళ్ళి చదువుకొని ఇంటికి వచ్చేవాడిని?

Dr పి వెంకట కృష్ణ గారి కేసులో OA సంఖ్య: 6947/2012 లో 23/01/2015న ఆంధ్ర ప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వారు ఇచ్చిన తీర్పు ప్రకారము, మీరు స్థానికులు అవుతారు. అయితే, ఈ విషయములో నిర్ణయము రెవెన్యూ అధికారులది కనుక వారిని సంప్రదించండి.

20. ప్రత్యక్ష భర్తీలో లోకల్ అభ్యర్థికి ఎంత శాతం రిజర్వేషన్ ఉంటుంది?

సాధారణంగా స్టేట్ కాడర్ కు 60% ఉంటుంది. నాన్ గజెటెడ్ ఉద్యోగాలకు 70% ఉంటుంది. గ్రూప్ IV కి 80% ఉంటుంది. ఈ పోస్టుల కేటగిరీ కూడా రాష్ట్రపతి గారి ఆదేశంలో 1975లో పొందు పరచడము జరిగింది. అదే విధంగా లోకల్ కి రిజర్వ్ చేయబడని పోస్టులకు అందరూ అర్హులే మరియు ఈ పోస్టులను మెరిట్ ఆధారంగా నింపడము జరుగుతుంది.

21. ప్రభుత్వ ఆదేశాల ప్రకారము నాకు వయో పరిమితి లో సడలింపు ఉన్నది. కానీ ఏపిపిఎస్సి విడుదల చేసిన ప్రకటనలో సడలింపు గురించి తెలుపలేదు?

ప్రతి ప్రకటన విడుదల చేసే ముందు నియమములను పరిశీలించి, వయో సడలింపు గురించి గాని, ఇతర విషయాలలో గాని వివరాలు పొందు పరచడము జరుగుతుంది. ఈ క్రమంలో ఏవైనా వివరాలు పొందు పరచకపోతే, ఏపిపిఎస్సి కి లిఖిత పూర్వకంగా తెలియచేసినట్లైతే వెంటనే సవరణ జారీ చేయడము జరుగుతుంది. అవసరమైతే మీ యొక్క అభ్యర్ధనని ప్రభుత్వానికి పంపి వివరణ తీసుకొనడము లేక ఆదేశాల జారీకి అభ్యర్ధన చేయడం జరుగుతుంది.

22. దివ్యాంగులకు అన్నీ పోస్టుల విషయంలో రిజర్వేషన్ ఉంటుంది. కానీ ఈ మధ్య ఏపిపిఎస్సి విడుదల చేసిన ప్రకటనలో కొన్ని పోస్టులకు రిజర్వేషన్ ఇవ్వ లేదు?

పైన తెలిపిన విధంగా, ఏపిపిఎస్సి రిజర్వేషన్ నిర్ణయించదు. కొన్ని ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సర్వీస్ నిబంధనలలో ఉద్యోగ అవసరాలకు తగినట్లు రిజర్వేషన్ నుండి మినహాయింపు ఉంటుంది. కావున సంబంధిత ప్రభుత్వ శాఖ మాత్రమే ఈ ప్రశ్నకి సమాధానము ఇవ్వగలదు. లిఖిత పూర్వక అభ్యర్ధన ఏపిపిఎస్సి కి పంపితే సంబంధిత శాఖ కి పంపి వివరణ తీసుకొనడము జరుగుతుంది.

23. క్రీమీ లేయర్ మీద నాకు అనేక సందేహాలు ఉన్నాయి. ఉదాహరణకి, ఆదాయంపై పరిమితి నాకు వర్తిస్తుందా. పరిగణనలోకి తల్లి తండ్రుల ఆదాయం తీసుకొంటారా లేక భర్త/భార్య ఆదాయం తీసుకొంటారా?

క్రీమీ లేయర్ విషయంలో కేవలం తల్లి/తండ్రుల ఆదాయం పరిగణన లోకి తీసుకొనబడుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే క్రీమీ లేయర్ విషయం లో 6 కేటగిరీలు ఉన్నాయి. ఈ కేటగిరీల వారికి రిజర్వేషన్ లభించదు. ఇవి అ)

రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్నవారి పిల్లలు; ఆ) తల్లి/తండ్రి ప్రత్యక్షంగా ఎంపికైన గ్రూప్I/క్లాస్ A అధికారి; లేక తల్లి తండ్రులు ఇద్దరూ ప్రత్యక్షంగా గ్రూప్ II/క్లాస్ B కి ఎంపికైన అధికారులు; లేక తండ్రి మాత్రమే ప్రత్యక్షంగా గ్రూప్ II/క్లాస్ B కి ఎంపికైన అధికారి కానీ 40 సంవత్సరముల వయసు వచ్చే లోపల గ్రూప్I/క్లాస్ A అధికారిగా ప్రమోషన్ సాధించారు; బ్యాంకులు, ప్రభుత్వ ఇన్సూరెన్స్ సంస్థలు, ప్రభుత్వ రంగా సంస్థలు, విశ్వవిద్యాలయాల వంటి స్వయం ప్రతిపతి గల సంస్థలు కూడా ప్రభుత్వపు కేటగిరీలోకే వస్తాయి; ఇ) మిలిటరీ ఉద్యోగులలో పదాతి దళం లోని కల్నల్ మరియు పై స్థాయి ఉద్యోగుల పిల్లలు (నావికా దళం మరియు వైమానిక దళం లోని సమాన హోదా కల వారికి కూడా); ఈ) వృత్తి నిపుణులు, వ్యాపారము, పారిశ్రామిక రంగం లోని వారి పిల్లలు, వరుసగా 3 సంప్వత్సరాలపాటు వార్షిక ఆదాయం 6 లక్షల రూపాయలు కానీ అంతకన్నా ఎక్కువ కానీ ఉన్నట్లైతే; ఎ) వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు (నిర్ణయించిన భూ పరిమితికి మించి ఉన్నట్లైతే); మరియు ఏ) వార్షిక ఆదాయము 6 లక్షలు కానీ అంతకు మించి ఉన్న వారు లేక ఆస్తి పన్ను కడుతున్న వారు (వీరిలో వ్యవసాయేతర ఆస్తులు కల వారు కూడా వస్తారు); ఈ కేటగిరీ లోకి, పై కేటగిరీ లోకి రాని రాజ్యాంగబద్ధ హోదా కల పదవులలోని వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, మిలిటరీ ఉద్యోగులు, వ్యవసాయ కుటుంబాల వారు కూడా వరుసగా 3 సంప్వత్సరాలపాటు ఇతర ఆదాయపు వనరులనుండి (అంటే జీతం మరియు వ్యవసాయం నుండి కాక) వార్షిక ఆదాయం 6 లక్షల రూపాయలు కానీ అంతకన్నా ఎక్కువ కానీ ఉన్నట్లైతే పరిగణింప బడతారు.

పైన తెలిపిన విషయాలు సంక్షిప్తమైనవి. సూక్ష్మ సందేహాల నివృత్తికి భారత ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు కానీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము 4/4/2006 నాడు జారీ చేసిన జీఓ ఎమ్ ఎస్ సంఖ్య : 3 మరియు 09/12/2013 నాడు జారీ చేసిన జీఓ ఎమ్ ఎస్ సంఖ్య : 26 కానీ పరిశీలించండి.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏపిపిఎస్సి క్రీమీ లేయర్ విషయం లో ఎ విధమైన ధృవీకరణలు చేయదు. అర్హత కల అభ్యర్థి నాన్ క్రీమీ లేయర్ సర్టిఫికేట్ సంబంధిత రెవెన్యూ అధికారి నుండి పొంది తన వద్ద ఉంచుకోవాలి. ప్రకటన విడుదల చేసే నాటికి సర్టిఫికేట్ తీసుకొని పరిశీలనకు సిద్ధంగా వుంచాలి.

24. ఏపిపిఎస్సి విడుదల చేసిన ప్రకటనని అనుసరించి దరఖాస్తు నింపేటప్పుడు కొన్ని సందేహాలు వస్తున్నాయి. ఉదాహరణకు ఓటిపిఆర్ లో నేను చదివిన యునివర్సిటి కానీ నా గ్రామమునకు సంబంధించి కానీ వివరం లభ్యం కావటం లేదు?

అన్ని వివరాలు సేకరించదానికి  ఏపిపిఎస్సి ప్రయత్నం చేస్తుంది. అయితే ఏదైనా విషయం అసమగ్రంగా ఉంటే, మా దృష్టి కి తీసుకొని వస్తే వెంటనే సవరించి పూర్తి సమాచారమ్ ఇవ్వడం లేక సేకరించడము జరుగుతుంది. ఈ విషయంలో ఏ అభ్యర్థికి అన్యాయం జరుగకుండా ప్రయత్నం చేయడం జరుగుతుంది.

25. పరీక్షా కేంద్రం వద్ద ఏదైనా సమస్య వస్తే ఏమి చేయాలి?

అభ్యర్థులు సకాలంలో అనగా హాల్ టికెట్ లో ఇచ్చిన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోనాలి. ఈ విషయంలో ఎటువంటి సడలింపు వుండదు. సరియైన గుర్తింపు కార్డ్ కూడా ఉండాలి. వేరే సమస్య ఏదైనా వస్తే, పరీక్ష కేంద్రములోని ముఖ్య పరీక్షా నిర్వహణ అధికారిని గాని, ఏపిపిఎస్సి చేత నియుక్తులైన పరిశీలకులను గాని సంప్రదించ వచ్చును. వారెవరూ అందుబాటులో లేక పోతే, ఏపిపిఎస్సి కంట్రోల్ రూంకి ఫోన్ చేయవచ్చు. ప్రతి పరీక్ష కి ముందు కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు అభ్యర్థులకు వెబ్ సైట్ ద్వారా తెలియపరచడము జరుగుతుంది. విషయము మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారము చూపడము జరుగుతుంది. అయితే అసంబద్ధమైన, అసహేతుకమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకొనము.

26. వెబ్ సైట్ యొక్క మరియు చెల్లింపు (పేమెంట్) లో సమస్యలు వస్తున్నాయి. సమాధానం దొరకటం లేదు?

మా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను వెబ్ సైట్ నిర్వాహకులైన APONLINE దృష్టికి తీసుకొని వెళ్ళి వెంటనే పరిష్కారము చూపమని కోరడం జరుగుతుంది. ఇటీవల వెబ్ సైట్ వేగం పెంచడానికి మరియు అనవసరమైన విషయాలను తొలగించడానికి చర్యలు తీసుకొనడము జరిగింది. ఫీస్  చెల్లింపు విషయంలో సంబంధిత పేమెంట్ గేట్ వే దృష్టికి కూడా సమస్యలను తీసుకొనిపోవడము జరుగుతుంది. ఒక వేల ఏ అభ్యర్థి ఐనా ఒకటి కన్నా ఎక్కువ మార్లు ఫీస్ చెల్లించినట్లైతే, ఆ డబ్బు ఏపిపిఎస్సి ఖాతాలోకి వస్తే లిఖిత పూర్వకంగా ఆధారాలు చూపితే, అధికంగా చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వడము జరుగుతుంది. దరఖాస్తు చేసేముందు మరియు ఫీస్ చెల్లించే ముందు, అభ్యర్దులు తమ ఇ-మెయిల్ ఖాతా మరియు మొబైల్ సరిగా ఉన్నాయో లేదో చూసుకొనాలి. అదే

విధంగా, కోడ్ నింపేటప్పుడు మరియు కోడ్ తిరిగి పొందటానికి వెబ్ సైట్ లోని USER MANUAL లో సూచించిన పద్ధతిని పాటించాలి. ఏపిపిఎస్సి ప్రతి సమస్యని ఆలస్యం చేయకుండా పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది.

27. నా యొక్క సమస్యని అనేక సార్లు ఏపిపిఎస్సి హెల్ప్ డెస్క్ దృష్టికి తీసుకొని రావడానికి ప్రయత్నం చేయడము జరిగింది. కొన్ని సార్లు ఫోన్ రింగ్ అయి అయి ఆగి పోయింది. కొన్ని సార్లు ఎంగేజ్ టోన్ వచ్చింది. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపడము జరిగింది. నాకు సమాధానము రాలేదు. కారణము ఏమిటి?

ప్రతి అభ్యర్థికి ఉన్న సమస్యలను పరిష్కారము చేయడానికి ఏపిపిఎస్సి సర్వదా ప్రయత్నం చేస్తుంది. అయితే, హెల్ప్ డెస్క్ పని దినాలలో ఆఫీసు వేళలలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు మాత్రమే పని చేస్తుంది. కాల్ లో ఉన్న అభ్యర్థుల సమస్యని పరిష్కరించేటప్పుడు, వెయిటింగ్ లో ఉన్న అభ్యర్థులకు ఎంగేజ్ టోన్ వస్తుంది. కావున అభ్యర్థులు తమ సమస్యని సూటిగా, క్లుప్తంగా తెలిపితే ఇతరులకు సమయం లభిస్తుంది. అదే విధంగా, వేలకు వేల సంఖ్యలో వచ్చే మెయిల్ కి కూడా వెంటనే సమాధానము ఇవ్వలేము. కావున, అతి ముఖ్యమైన సమస్య ఉంటే లిఖిత పూర్వకంగా ఆధారాలతో పంపితే త్వరగా పరిష్కారం దొరుకుతుంది. అభ్యర్థులు గమనించ ప్రార్థన.